# రాయలసీమ సంస్కృతిని తెస్తున్నారు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

- కాంగ్రెస్ అభ్యర్థి నన్ను హతమార్చేందుకు కుట్ర చేసిండు
- అచ్చంపేట అభివృద్ధి కోసం అందరూ ఆలోచించాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అచ్చంపేట, నవంబర్ 28 : అచ్చంపేట నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా రాయలసీమ సంస్కృతిని కాంగ్రెస్ పార్టీ తెర లేపి నాపై కుట్రలు చేసి స్వయంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీకృష్ణనే నన్ను రాయితో కొట్టడం దుర్మార్గమని అచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం అచ్చంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నైజం ఎట్లుంది అంటే దొంగే దొంగ అన్నట్లుగా ఉందన్నారు. అచ్చంపేట కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ చదివిన చదువు డాక్టర్ వృత్తి ప్రాణాలు కాపాడాలి తప్పా ప్రాణాలు తీయడానికి కాదన్నారు. ప్రాణాలు తీస్తున్న వంశీకృష్ణ మనకు అవసరమా? అని ప్రశ్నించారు. ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా నేను సేవ చేస్తుంటే దాడులే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తుందన్నారు. రాయలసీమ నుంచి హంతకులను తీసుకొచ్చి నన్ను హతమార్చే ప్రయత్నం ఈ రౌడీ నాయకుడు వంశీకృష్ణ చేస్తున్నారని విమర్శించారు. ఈ రేటెంతరెడ్డి కొడంగల్‌కి నాన్ లోకల్, మిడ్జిల్, మల్కాజ్ గిరి అదే విధంగా కాంగ్రెస్ పార్టీకి నాన్ లోకల్ అన్నారు. దాడులు చేస్తూ కుల పిచ్చి చేస్తున్న ఈ రౌడీ పాలన కావాలా ప్రజలకు సేవ చేస్తున్న ప్రజా నాయకుడు గువ్వల బాలరాజు కావాలా? ప్రజలు ఆలోచించాలని అన్నారు. పరిశ్రమల స్థాపనతో పాటు ఐటీ రంగాన్ని అచ్చంపేట వరకు విస్తరించే విధంగా కృషి చేస్తానని అన్నారు. అచ్చంపేట లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తున్నారు. రైతుల పొలాలను కృష్ణమ్మ నీటితో తడుపుతానని అన్నారు. అచ్చంపేట తెలంగాణ ప్రభుత్వంలో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. ఆధ్యాత్మికంగా, టూరిజం ప్రాంతంగా, వైద్య, విద్యపరంగా ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. వంశీకృష్ణ నైజం అచ్చంపేట ప్రజలు గ్రహించాలని అన్నారు. డాక్టర్ భిక్షపతికి కాంగ్రెస్ పార్టీ బీఫామ్ ఇస్తే ఆయనపై దాడిచేసి బీఫామ్ చింపివేసి వంశీకృష్ణ ఎన్నికల్లో పోటీచేశారని, అప్పట్లో సొంతపార్టీ నేత సతీశ్‌మాదిగపై దాడిచేసి పార్టీనుంచి వెళ్ల గొట్టారని, ఇప్పుడు నన్ను అడుగడుగునా దాడులు చేస్తూ చివరికి హత్య చేసేందుకు కూడా వెనుకాడడం లేదని అన్నారు. జైలులో ఉన్న ఖైదీలు కోర్టుకు వస్తే దర్బార్ నడిపిస్తూ అచ్చంపేటను ఆగం చేసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ వస్తే అచ్చంపేట ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. వ్యాపారస్తులు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, అగ్రవర్ణపేదలు ఆలోచించాలని అన్నారు. అచ్చంపేటలోని వ్యాపారస్తులు పదేళ్లలో స్వేచ్ఛగా వ్యాపారాల చేసుకున్నారని వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆగడాలు చూసిన ప్రజలెవ్వరు దయచేసి అచ్చంపేట అభివృద్ధి కోసం ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ చైర్మన్ నరసింహాగౌడ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణ, మున్సిపల్ మాజీ చైర్మన్ తులసీరాం, పట్టణ అధ్యక్షుడు పులిజాల రమేశ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

**మీ అందరి వాడిని..**

మీ అందరి వాడినైన తనను మీ అందరి ఓటుతో గెలిపించి ఆశీర్వదించాలని అచ్చంపేట బీఆర్ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజైన మంగళవారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టీచర్స్ కాలనీ ఎమ్మెల్యే నివాసగృహం నుంచి మసీద్ వరకు ర్యాలీ నిర్వహించారు. పట్టణం మొత్తం గులాబీమయంగా మారింది. మహిళలు భారీగా పాల్గొన్నారు. గువ్వల సతీమణి అమలతో కలిసి భారీ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీనుద్దేశించి ఆయన మాట్లాడుతూ మీ అందరి మంచికోరే ప్రభుత్వం మన అందరి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించి హ్యాట్రిక్ విజయంతో గెలిపించాలని కోరారు.

# అభివృద్ధిని చూసి ఆదరించండి

- పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి కల్పిస్తాం
- రోడ్‌షోలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి
- హాజరైన మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి మర్రి జమున


నాగర్‌కర్నూల్ రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, నవంబర్ 28: తాను రాకముందు తొమ్మిదేండ్ల కింద ఉన్న అభివృద్ధి, ఇప్పటి కందనూలు అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రజలను కోరారు. గతంలో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉండిందని, తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయించి అందుకు దీటుగా అభివృద్ధి సాధించామన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రం అయిన కొద్ది కాలంలోనే మెడికల్ కళాశాలను మంజూరు చేయించి ప్రారంభించడం జరిగిందన్నారు. గతంలో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ నీళ్లు మళ్లుకునేవని, భూగర్భ డ్రైనేజీ, రోడ్డు డివైడర్ చేయించిన తర్వాత కందనూలు రూపు రేఖలు మారాయన్నారు. అసంపూర్తిగా ఉన్న కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేయించి రైతుల కుసా గనీరు అందిస్తున్నామన్నారు. కొద్ది కాలంలోనే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తన హయాంలోనే పూర్తి చేయించామన్నారు. గెలిచిన ఏడాదిలోపే పరిశ్రమలను ఏర్పాటు చేసి మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొల్లాపూర్ చౌరస్తాలో పదెకరాల్లో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేసి విద్యావంతులైన యువతకు ఇక్కడే ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి నాగం సహకారంతో ఇచ్చిన మాట ప్రకారం ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయించి ఉన్నత విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రెండు పర్యాయాలు తనను ఆదరించారని, మరో సారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. గెలిచిన రెండు నెలల్లోనూ అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కట్టించి ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే జరగని అభివృద్ధిని కందనూలు చేశానన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మితే మోసపోతారన్నారు. కందనూలు మరింత అభివృద్ధి చెందాలంటే మర్రి జనార్దన్ రెడ్డియే ఇక్కడ గెలవాలని మీ మనస్సులో తలచుకొని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఇప్పటికే జరిగిన అభివృద్ధిని చూసి ఇది మన ఊరేనా అని విదేశాల్లోని ప్రజలు ఆశ్చర్య పోతున్నారన్నారు. కారు గుర్తుకు ఓటేస్తే రూ.4 వేల పింఛన్లు, సౌభాగ్య లక్ష్మి పథకం మహిళలకు, యువతులకు నెలకు 3 వేల రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పేదింటి ఆడబిడ్డలను ఆదుకునేందుకు వందల పెండ్లిళ్లు చేశానని, ఇంకా చేస్తూనే ఉంటానన్నారు. ప్రతిపక్ష నాయకుడు దామోదర్ రెడ్డిలా పార్టీ మారనని, ఆరుసార్లు ఓడిపోయాడని, ఈసారి పార్టీ మారి కొడుకును రంగంలోకి దించాడన్నారు. అయినా ఎవరూ వారి మాటలు నమ్మవద్దని, కందనూలులో ఇదివరకు జరిగిన అభివృద్ధిని ఆదరిస్తే సరిపోతుందన్నారు. కందనూలు బాగుండాలంటే 30వ తేదీన కారుకు ఓటేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అదేవిధంగా నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తనను స్వయంగా పిలిపించి ఎంతకాలం అవమానాలు భరిస్తావని, తనను వచ్చి అభివృద్ధికి సహకరించాలంటే బీఆర్ఎస్‌లోకి వచ్చి మర్రి జనార్దన్‌రెడ్డికి సపోర్టు చేస్తున్నానన్నారు. అందుకే మర్రి గెలుపుకోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. మర్రితో కలిసి నాగర్‌కర్నూల్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే సతీమణి మర్రి జమునారాణి మాట్లాడుతూ కండువాలు మార్చి పార్టీలు మార్చిన వారికి ఓటు వేస్తారా సేవాదృక్పథంతో పార్టీలోకి వచ్చి సేవ చేస్తున్న వారికి ఓటు వేస్తారా అన్నది మీరే నిర్ణయించుకోవాలన్నారు. కళ్లతో చూసిన అభివృద్ధికి ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, నాగం శశిధర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాబురావు, కౌన్సిలర్లు, మహిళలు ఉన్నారు.

# బీఆర్ఎస్‌ను మరోసారి ఆశీర్వదించండి

- నియంతను శాశ్వతంగా ఇంటికి పంపండి
- మాదాసీ కురుమలకు ఎస్సీ సర్టిఫికెట్లు ఇప్పించేందుకు కృషి
- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి


కురుమల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, నవంబర్ 28 : ప్రజలతో మమేకమై అందుబాటులో ఉంటూ అనతికాలంలోనే 20 ఏండ్లలో నియంత చేయని అభివృద్ధిని మూడేళ్లలో చేశానని.. తనను మరో సారి ఆశీర్వదించాలని కొల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలను కోరారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార ఘట్టం ముగింపు సందర్భంగా మంగళవారం సాయంత్రం కొల్లాపూర్‌లో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావుతో కలిసి ఎమ్మెల్యే బీరం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా బీరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చొరవతో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల చిరకాల స్వప్నమైన కల్వకుర్తి– కొల్లాపూర్–నంద్యాల వరకు 167కే జాతీయ రహదారి పనులు కొనసాగుతుండగా, సోమశిల–సిద్ధేశ్వరం మధ్య కృష్ణా నదిపై ఐకాన్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని గుర్తు చేశారు. ఈ రెండు పూర్తయితే కొల్లాపూర్ స్వరూపరమే మారి పోతుందన్నారు. వ్యాపారపరంగా ఎంతో అభివృద్ధి సాధించనుందని ప్రజలకు వివరించారు. అదే విధంగా కొల్లాపూర్‌లో హార్టికల్చర్, పాలిటెక్నిక్ కళాశాలలు, జూనియర్ కళాశాల, ఆర్డీవో, ఆర్అండ్‌బీ సబ్ డివిజన్ కార్యాలయాలు, ఎంసీహెచ్ దవాఖాన, డయాలసిస్ కేంద్రం, పట్టణంలో పార్కు, పట్టణంలో రహదారుల వెంట డివైడర్లు, సర్కిళ్ల ఆధునీకరణ వంటి ఎన్నో అభివృద్ధి పనులు చేశామని గుర్తు చేశారు. 20 ఏండ్లపాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన ఓ పెద్ద మనిషి తన స్వార్థ ప్రయోజనాల కోసమే పనిచేశాడని, ఏనాడు ప్రజా సమస్యలను పట్టించుకోలేదని, అలాంటి నియంతను శాశ్వతంగా ఇంటికి పంపించాలని ప్రజలకు సూచించారు. అంతకు ముందు పట్టణంలో మాదాసీ కురుమల ఆత్మీయ సమ్మేళనం దేవేందర్ అధ్యక్షతన నిర్వహించగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ కురుమ విజయకుమార్, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బీరం మాట్లాడుతూ మాదాసి కురుమ/మదారి కురుమలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చే విధంగా సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి ఇది వరకు తీసుకెళ్లానని, ఈ మారు మీరందరూ ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపితే మీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం తాలూకా అధ్యక్షుడు బీరయ్య, ఉపసర్పంచ్ ఈశ్వర్, నాయకులు ధర్మయ్య, ఎల్లయ్య, ఆవుల కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# గెలుపు బీఆర్ఎస్‌దే..

- అభివృద్ధిలో పాల్పంచుకోవాలి
- ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్
- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్


కల్వకుర్తిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కల్వకుర్తి, నవంబర్ 28 : ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని మాయమాటలు చెప్పినా బీఆర్ఎస్ గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని బీఆర్ఎస్ అభ్యర్థి, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ మోటర్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌ను ఆదరిస్తున్నాయని, రేపు జరుగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయాన్ని సాధిస్తుందని చెప్పారు. ముచ్చటగా మూడో సారి ముఖ్యమంత్రిగా కేసీఆర్ అధికారాన్ని చేపట్టబోతున్నారని పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటంతో ముందున్నానని, మరోసారి ఆదరిస్తే సేవకునిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. కల్వకుర్తి ప్రాంతానికి సాగునీరు అందించి రైతులు జీవితాల్లో వెలుగులు నింపిన బీఆర్ఎస్ ప్రభుత్వం కల్వకుర్తి అభివృద్ధికి ఇతోధికంగా నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. కల్వకుర్తిలో ఇచ్చిన మాట ప్రకారం 100 పడకల దవాఖానకు శంకుస్థాపన చేసుకున్నామని, దవాఖానలో డయాలసిస్ కేంద్రాన్ని సమర్థవంతంగా నడిపించుకుంటున్నామని చెప్పారు. పరిపాలన సౌలభ్యం కోసం కల్వకుర్తిలో రెవెన్యూ డివిజన్ కేంద్రం, డీఎస్పీ కేంద్రంతో పాటు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. మరింత అభివృద్ధి అవసరం ఉన్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీని మరోసారి గెలిపించాల్సిన చారిత్రాత్మక అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పాలమూరు–రంగారెడ్డి పథకం ద్వారా కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందుతుందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలను నమ్ముకుంటే రాష్ట్ర భవిష్యత్తు చీకటిమయంగా మారుతుందని, బీఆర్ఎస్ పార్టీని ఆదరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అంతకు ముందు పాలమూరు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ చైర్మన్ శ్రీశైలం, బీఆర్ఎస్ నాయకులు బావండ్ల మధు, రుక్కులు, షాహెద్, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజులు మద్యం దుకాణాలు బంద్

నాగర్‌కర్నూల్, నవంబర్ 28: ఈనెల 30న జిల్లాలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలోని వైన్స్, బార్లు, కల్లు కంపౌండ్లను 28వ తేదీ మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి మూసి వేస్తున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి షేక్ ఫయాజుద్దీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30వ తేదీ పోలింగ్ ముగిసిన అనంతరం తిరిగి షాపులను తెరుస్తారని పేర్కొన్నారు.